క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి ఎస్‌ఐ వితరణ



వృద్ధులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేష్

పుంగనూరు: పట్టణంలోని తెలుగుతల్లి వృద్ధాశ్రమానికి ఆదివారం స్థానిక ఎస్‌ఐ లోకేష్ రూ.15 వేల విలువ చేసే నిత్యావసర సరుకులు వితరణ చేశారు. వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ముచ్చటించారు. వారికి ఎలాంటి సాయం కావాలన్నా చేస్తానని హామీ ఇచ్చారు.

నాయకుల మృతికి నివాళి



మునిరాజు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట :మండలంలోని ఎస్ బండపల్లెకు చెందిన గంగయ్య, అలాగే చింతమాకులపల్లెకు చెందిన మునిరాజు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వీరిద్దరూ వైఎస్సార్ సీపీ నాయకులే. సమాచారం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదివారం ఆయా గ్రామాలకు వెళ్లి వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గోపిరెడ్డి, పార్టీ నేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ కలశం ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో కొలువు తీరిన ముత్యాలమ్మ

రొంపిచెర్ల: ముత్యాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి స్థానిక పురవీధుల్లో బ్యాండు మేళాల హోరు నడుమ ఊరేగించారు. అలాగే సాయంత్రం ముత్యాలమ్మ అమ్మవారు విశేష అలంకరణతో ఊరేగారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అలయ అర్చకులు గుణశేఖర్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన



అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

వి.కోట: విద్యార్థులు పుస్తక పఠనం ఒక వ్యాపకంగా మలచుకుంటే జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందని గ్రంథాలయ సిబ్బంది అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్, రీడింగ్, ఇంగ్లిష్, యోగా, కథలపై అవగాహన కల్పించారు. వాటి వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు.వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన 'దుర్యోధన వధ'



యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

గుడిపాల: మండలంలో వసంతాపురంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో 18 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి వినయప్రసాద్‌రెడ్డి హరికథాగానం చేశారు. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. దుర్యోధనుడు గంగ మడుగులో దాక్కుని ఉండగా, భీమసేనుడు బయటకి లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం భక్తులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకర పోరు భక్తులను కట్టి పడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన పోరులో దుర్యోధనుడు తనువు చాలించాడు. కళాకారుల నాటక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం భక్తులు అమ్మవారి అగ్నిగుండ ప్రవేశంతో మొక్కులు చెల్లించారు.

ఐదు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

- ఎక్స్‌ప్రెస్ హైవే పనులతో నిలిచిన వాగు నీరు
- నాలుగు రోజులుగా గ్రామాల్లోనే జనం
- అత్యవసరమైనా రాలేని పరిస్థితి
- వాగుల్లో నీరువెళ్లే మార్గాలపైనే చేస్తున్న హైవే పనులే కారణం





గొల్లపల్లె నుంచి మాదిగబండకు మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీలో ఐదు గ్రామాలకు ఐదురోజులుగా రాకపోకలు స్తంభించడడంతో ఆ గ్రామాల ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీకావు. అత్యవసరమై ఆస్పత్రికి వెళ్లాలన్నా వీలుకావడం లేదు. ఎందుకంటే ఈ గ్రామాలకు వెళ్లే రహదారిపై చెన్నై– బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్నారు. ఈ హైవే కింద గ్రామాలకు వెళ్లే దారిపక్కనే వాగు ప్రవహిస్తోంది. దీనిని హైవే నిర్మాణంలో పూడ్చేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో వాగు ప్రవహించి వరదనీరు అక్కడ ఆరు అడుగుల వరకూ చేరి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ఈ నీటి దెబ్బకు ఐదు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.

ఈ మార్గం మినహా ప్రత్యామ్నాయం లేదు

పలమనేరు–కుప్పం మెయిన్ రోడ్డు నుంచి మాదికబండ గ్రామానికి ఇదొక్కటే రోడ్డు. మరోవైపు దొడ్ల డెయిరీ నుంచి చెన్నుపల్లె మీదుగా మాదిగబండకు వెళ్లాలన్నా ఇదే మార్గం. గంగమాంబ సర్కిల్ వద్ద వాగు పక్కన దారిలో ఇప్పటిదాకా వెళుతుండే వారు. ఎక్స్‌ప్రెస్ హైవే పనులతో వాగు ప్రవహించకుండా మట్టి వేయడంతో అక్కడ వరదనీరు చేరి ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉత్పన్నం కావడంతో దిగువమారుమూరు, పాలమాకులపల్లె, ఎరగుండేపల్లె, మాదిగబండలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఈ గ్రామాల్లో దాదాపు 350 కుటుంబాలు ఉన్నాయి. వీరి ప్రధాన వృత్తి, వ్యవసాయం, పాడిపరిశ్రమగా ఉంది. కనీసం పాల వాహనాలు రాక, వీరు పాలను తీసుకెళ్లలేక పాలను కాచి, కోవా చేసుకోవాల్సివస్తోందని గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి ఆవేద్య వ్యక్తం చేశారు. ఇక ఎవరైనా తీవ్ర అనారోగ్యం బారిన పడితే పలమనేరుకు తరలించలేని దుస్థితి కలిగింది.ఆ గ్రామాల నుంచి చుట్టుకుని రావాలన్నా మూడువైపులా అడవి మాత్రమే ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా రైతులు కూరగాయలు, వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లలేక నష్టాలపాలవుతున్నారు.

ఇష్టానుసారంగా ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

మండలంలో ఎక్స్‌ప్రెస్ హైవే పనులను ఇష్టానుసారంగా చేస్తున్నారు. గ్రామీణ రహదారులపై రోడ్డు వేసి పలుచోట్ల అండర్‌పాస్‌లు వేయలేదు. ముఖ్యంగా వర్షాలు పడినప్పుడు ప్రవహించే చిన్నపాటి వాగులు, వంకలు వెళ్లే మార్గాలకు కనీస ప్రకృతి పరిజ్ఞానం లేకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో వర్షపు వెళ్లలేని పరిస్థితులు పలుచోట్ల నెలకొన్నాయి. కనీసం మోటార్లతోనైనా వరదనీటిని ఖాళీ చేసి మాదిగబండవైపు గ్రామాలకు రాకపోకలు సాగించేలా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్వాహకులు స్థానిక అధికారులు సూచించి తగు చర్యలు తీసుకోవాలని ఐదు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న 'ఇలావంతుని బలి'



ఇలావంతుని ప్రతిమ వద్ద బలి చేస్తున్న దృశ్యం

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో నిర్వహిస్తున్న శ్రీ ద్రౌపదీ ధర్మరాజుల మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఇలావంతుని బలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం సమీపంలో ఇలావంతుని ప్రతిమకు ప్రత్యేక అలంకరణ చేసి ముస్తాబు చేశారు. యుద్ధానికి ముందు రోజు ఇలావంతుని బలి కార్యక్రమం నిర్వహించినట్టు .మహాభారతగాథ. దీనికి తగినట్టు ఇలావంతుని బొమ్మవద్ద కాళికాదేవిని ఏర్పాటు చేసి పొట్టేలును బలి ఇచ్చారు. ఆ తర్వాత వచ్చిన ఆయుధపూజ చేశారు. అనంతరం ఇలావంతుని బలి కార్యక్రమం ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. రాత్రి ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీకృష్ణ రాయబారం నాటకం ప్రదర్శించారు.

నేడు 'దుర్యోధన వధ'

ద్రౌపదీ ధర్మరాజుల మహాభారత మహోత్సవాలు సోమవారం సాయంత్రం దుర్యోధన వధ, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, పచ్చి గెరిగ కార్యక్రమాలతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కొవ్వొత్తులతో నివాళి



:ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం నిర్వహిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని కోర్ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సౌజన్యంతో స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక సీఐ నరసింహరాజు మాట్లాడారు. ఎయిడ్స్ బాధితులను చిన్నచూపు చూడరాదని, వారికి సాటి మనుషుల్లా ఆదరించాలని కోరారు. ఎయిడ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి ఎయిడ్స్ మృతులకు నివాళులు అర్పించారు. కోర్ సంస్థ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

21న మండల సమావేశం

- రొంపిచెర్ల: ఈ నెల 21న మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

పుంగనూరు: పెహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ పాక్‌పై దాడి చేసి ఉగ్రవాద స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడంతో కొన్ని రోజులుగా దేశమంతటా విజయోత్సవ ర్యాలీలు చేస్తున్నారు. ఈ కోవలో ఆదివారం సాయంత్రం పట్టణంలోని పలు సంఘాలు భారత్ తిరంగా ర్యాలీ నిర్వహించాయి. జాతీయ జెండాలు పట్టుకుని మేరాభారత్ మహాన్ ...భారతదేశం వర్థిల్లాలి అని నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ర్యాలీ చేశారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు నివాళులర్పించి, వారి కుటుంబాలకు సంతాప సందేశం పంపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులతోపాటు పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

రేపు బంగారుపాళెంలో గంగజాతర



బంగారుపాళెం: మండల కేంద్రంలో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు జాతర కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారికి అంబలి, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమమర్పించనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగించి నడివీధిలో కొలువుదీర్చనున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ జల ప్రవేశానికి తరలించనున్నట్లు పేర్కొన్నారు. జాతర పురస్కరించుకుని గ్రామంలో విద్యుద్దీపాలతో అమ్మవారి కటౌట్లను ఏర్పాటు చేశారు.

చల్లబడిందోచ్..!



.మేఘావృతమైన ఆహ్లాదకరంగా మారిన వాతావరణం

– మూడు రోజులు చిరు జల్లుల వర్షం

కుప్పం: వేసవిలో మండుతున్న ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. మూడు రోజులుగా చిరుజల్లులతో కూడిన వర్షం పడుతుండడంతో వాతావరణం మారింది. ప్రతి ఏటా శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరకు వచ్చే లక్షలాది భక్తులు ఇక్కడ మండుటెండల ధాటికి అల్లాడిపోయేవారు. ప్రధానం సోమ, మంగళ, బుధవారాల్లో గంగ జాతర అతివైభవంగా నిర్వహిస్తారు. సోమవారం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం . మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకు అమ్మవారి కళ్ల తెర తొలగించి శిరస్సును పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తారు. పట్టణంలో ప్రతి వీధిలో ఈ ఊరేగింపు సాగుతుంది. అలాగే, ప్రతి ఇంటా పూజలు చేసి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో కుప్పం పట్టణం చల్లని వాతావరణంతో ఆహ్లాదకరంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంకాలం వరకు చిరుజల్లుల వర్షం కుప్పం తడిపేసింది. జాతర సమయంలో వర్షంతో గంగమ్మ దీవించిందంటూ పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

భక్తులతో బోయకొండ కిటకిట



క్యూ లైన్లలో భక్తులు

– సేవా టికెట్లతో రూ.12.16 లక్షల ఆదాయం

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఆలయంలో వివిధ సేవా టికెట్ల విక్రయాలతో రూ.12.16 లక్షల ఆదాయం అలాగే అన్నదానం పథకం నిర్వహణకు రూ.13 వేలు సమకూరినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఊరిసున్న పదవులు..ఊసేలేని నియామకాలు

- ఏడాది అవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- అనహనంలో ఆశావహులు



కుప్పం మార్కెట్ యార్డు

కుప్పం: నియోజకవర్గంలోని నామినేటెడ్ పదవులు ఎవరిని వర్తిస్తాయోనని ఆసక్తితో అందరూ ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా కుప్పం నియోజకవర్గంలో ఒక్క నామినేటెడ్ పదవినీ భర్తీ చేయలేదు.. దీంతో పదవులపై ఆశలు పెట్టుకున్న ఆశావహులు అసంతృప్తితో ఉంటున్నారు. పదవులు ఆశించి తమ బయోడేటాను అధిష్టానానికి అందజేసినా ఇప్పటివరకూ ఉలుకూ పలుకూ లేకపోవడం, నియామకాల విషయంలో సానుకూలంగా ప్రభుత్వం స్పందించకపోవడంతో కుతకుతమని లో..లోపల ఉడికిపోతున్నారు. పైకి మాత్రం గుంభనంగా ఉంటున్నారని తెలుగు తమ్ముళ్లే జోకులేసుకుంటున్నారు.

మార్కెట్ కమిటీ నియామకం ఎప్పుడో..?

నియోజకవర్గంలో ప్రధానమైన నామినెటెడ్ పదవి కలిగిన మార్కెట్ యార్డు. ఈ పదవి కోసం పలువురు పోటీ పడుతున్నారు. కుప్పం నియోజకవర్గ యువత అధ్యక్షుడు మణి, రామకుప్పం మాజీ ఎంపీటీసీ మునుస్వామి, గుడుపల్లె మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కాణిపాకం వెంకటేష్‌తో పాటు పలువురు కమిటీ చైర్మన్ రేసులో వున్నారు. కానీ టీడీపీ నాయకులు ఇప్పటి వరకు ఎవరికీ హామీ ఇవ్వక పోగా కేవలం అధిష్టానం నిర్ణయం మేరకు నడచుకుంటామని చెబు తున్నారు. దీంతో ఇంతకాలంగా ఎదురుచూస్తున్న వారికి టెన్షన్ తప్పడం లేదు. మార్కెట్ యార్డులో ఇప్పటికే కమిటీ లేక పాలన గాడి తప్పింది. ఈ యార్డులో కూరగాయలు, టమాట కమీషన్ మండీలు రాజ్యమేలుతున్నాయి. కమిటీని నియమిస్తే గానీ ఇక్కడ పరిస్థితులు ఓ గాడిన పడేలా లేవు.

రెస్కో ఎవరిపరం..?

నియోజకవర్గ స్థాయిలో మరో ప్రధానమైన నామినెటెడ్ పదవి రెస్కో పాలకవర్గం. రాష్ట్రంలో పలుచోట్ల రెస్కోను ట్రాన్స్‌కోలో విలీనం చేశారు. కేవలం కుప్పం నియోజకవర్గంలో మాత్రం రెస్కోగానే కొనసాగుతోంది. దీనికి పాలకవర్గాన్ని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు అంతంతమాత్రంగానే వున్నాయి. రెస్కో చైర్మన్‌గా కుప్పం మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్, శాంతిపురం టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, గుడుపల్లె మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ తదితరులు పోటీ పడుతున్నారు. రెస్కో సంస్థ ఇప్పటికే పలు వివాదాల నడుమ కొనసాగుతోంది. వీటిని సర్దుబాటు చేసేందుకు సమర్ధవంతమైన చైర్మన్‌ను నియమించాలని అధికార పార్టీ యోచిస్తోంది. ఈ దిశగా టీడీపీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబును నియమించేందుకు అధికార పార్టీ ఉన్నట్లు సమాచారం.

నామినేటెడ్ నియామకాల్లో జాప్యం ఎందుకో..!

నియోజకవర్గంలోని నామినెటెడ్ పదవుల నియామకాల్లో జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆ పార్టీ లేదలే తలలు పట్టుకుంటున్నారు. మార్కెట్ యార్డు, రెస్కోతో పాటు గుడివంక సుబ్రమణ్యస్వామి దేవాలయం, అసైన్‌మెంట్ కమిటీ, బిల్డింగ్ సొసైటీ కమిటీ, కో–ఆపరేటివ్ సొసైటీ, టౌన్ బ్యాంకు..మొదలైన వాటికి నామినెటెడ్ పోస్టులు భర్తీ చేయాల్సి వుంది. కేవలం తిరుపతి గంగమ్మ దేవస్థానానికి సంబంధించి ఉత్సవ కమిటీని మాత్రం తాత్కాలికంగా నియమించడం తప్పితే పూర్తిస్థాయిలో కమిటీని భర్తీ చేయలేదు. దీంతో అధికార పార్టీనాయకులు, కార్యకర్తలు కుతకుతమని ఉడికిపోతున్నారు.

మైనర్లకు బైకులిస్తే బాధ్యత తల్లిదండ్రులదే : సీఐ

పలమనేరు: మైనర్లకు బైకులిస్తే దానికి పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనని పలమనేరు సీఐ నరసింహరాజు హెచ్చరించారు. ఆదివారం ఆయన తన సిబ్బందితో కలిసి పట్టణంలో వాహనాల తనిఖీ చేశారు. ముఖ్యంగా మైనర్లు, లైసెన్సు లేనివారు, సైలెన్సర్లు తీసేసి డ్రైవ్ చేసేవాళ్లను లక్ష్యంగా పలు బైకులను పట్టుకున్నారు. వీరిలో కొందరికి జరిమానాలు విధించారు. మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి వారికి పిల్లల ముందే కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా మైనర్లు ద్విచక్రవాహనాలను నడుపుతూ పట్టుబడితే జరిమానా తప్పదని, అంతేకాకుండా దీనికి తల్లిదండ్రులు కూడా మూల్యం చెల్లించక తప్పదని చిన్నపాటి క్లాసు తీసుకున్నారు. మైనర్లకు మోటార్ సైకిళ్లు ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని హితవు పలికారు.